

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్దవటం రేంజిలో శుక్రవారం అధికారులు తనిఖీలు చేపట్టారు. 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ కళావతి తెలిపారు. -6లో



అండర్-14 క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

కడపలో ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. -6లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.820	రూ.880
రెండోరకం	రూ.700	రూ.800

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 106 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	495	510
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 136.700 కిలోలు

కల్తీ కుట్రలపై తొలి దెబ్బ

- సుప్రీంకోర్టు తీర్పుతో కుంగుతిన్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ నైతిక విజయంగా భావిస్తున్న శ్రేణులు
- ప్రభుత్వ తీరుపై భక్తుల మండిపాటు



సాక్షి రాయచోటి: ఆది నుంచి కుట్రలు, కుతంత్రాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టింది పేరు. ఏదో ఒక రకంగా ప్రతిపక్షాన్ని దెబ్బతీయాలని వ్యూహాలకు పదునుపెడుతూనే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రజలకు అమలు చేయలేని హామీలిచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ సూపర్ సిక్స్ గురించి పట్టించుకోకపోవడంపై సర్కార్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఇలాంటి తరుణంలో పవిత్రమైన తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ వ్యవహారాన్ని తెరమీదికి తీసుకొచ్చారని బహిరంగంగానే చర్చ జరుగుతోంది లడ్డూలో కల్తీ జరగకపోయినా జరిగినట్లు దుష్ప్రచారం చేయడంపై ఆధ్యాత్మిక వేత్తలతోపాటు భక్తులు రగిలిపోతున్నారు.

- తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కూటమి కుయుక్తులు చేయడంపై సుప్రీం కోర్టు ఇటీవల సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కల్తీ జరిగినట్లు ఎలా నిర్ధారిస్తారని...బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తులు టెస్టులు చేయకముందే కల్తీ జరిగిందంటూ మాట్లాడిన వైనంపై సీరియస్ అయ్యింది. ప్రత్యేక విచారణతోనే న్యాయం జరుగుతుందని భావించి సుప్రీం కోర్టు అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఏమి చేయాలో పాలు పోని పరిస్థితులు నెలకొన్నాయి... కల్తీ వ్యవహారం టీడీపీని కలవరపెడుతోంది.. తిరుమల వ్యవహారంలో ప్రతిపక్ష పార్టీని ఇబ్బంది పెట్టాలని వ్యూహం రచిస్తే దేవుడే అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారని అన్ని వర్గాల ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రత్యేక విచారణ: సుప్రీంకోర్టు ఆదేశాలతో లడ్డూ వ్యవహారంపై ప్రత్యేక విచారణ జరుగనుంది.. ప్రదానంగా సీబీఐ అధికారులతో పాటు స్థానిక అదికారులు కూడా టీములో ఉండనున్నారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం సిట్ విచారణ పేరుతో ముందుకు వచ్చినా న్యాయం జరగదని అన్ని పార్టీలు వ్యతిరేకించాయి. లడ్డూపై సర్కారు ఆడుతున్న కొత్త నాటకంపై పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కోర్టుకు వెళ్లడంతో బాబు పన్నాగంపై బ్రేకులు పడినట్లయింది. ఉన్నది లేనట్లు...లేనిది ఉన్నట్లు చూపిస్తూ.. నిర్ధారణ లేకుండా మాట్లాడుతున్న వైనాన్ని అన్ని వర్గాలు తీవ్ర స్థాయిలో ఖండించాయి. ఎట్టకేలకు సుప్రీం కోర్టు ప్రత్యేక విచారణకు ఆదేశాలు ఇవ్వడంతో నిజనిజాలు నిర్ధారణ అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.

నైతిక విజయం

లడ్డూ వ్యవహారంపై టీటీడీ పెద్దలు ఒకమాట, సీఎం మరోమాట మాట్లాడుతున్న వైనాన్ని ఎత్తి చూపుతూ కల్తీ జరగలేదని వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తూనే ఉంది. అంతేకాకుండా ఇటీవల చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వరుసగా కోర్టులో వచ్చిన తీర్పులు కూటమి సర్కార్‌కు చెంపపెట్టు కాగా, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి నైతిక విజయంగా పలువురు అభివర్ణిస్తున్నారు. నిర్ధారణ కాకుండానే జంతువుల కొవ్వు కలిసిన పదార్థాలతో లడ్డూ తయారు చేశారంటూ టీడీపీ చేసిన దుష్ప్రచారం కూటమి సర్కార్ తలకు చుట్టుకుందని ఆధ్యాత్మిక వేత్తలు అనుకుంటున్నారు.

బాబు జిమ్మిక్కులకు సుప్రీంకోర్టు చెక్



తిరుమల లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబు చేసిన జిమ్మిక్కులకు సుప్రీంకోర్టు చెక్ పెట్టింది.లడ్యూలో కల్తీ జరిగిందని బాబు ఆరోపించడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఆక్షేపిస్తూనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిజాలను నిగ్గు తేల్చాలి. నీచ రాజకీయాలకు దేవుళ్లను సైతం వాడుకోవడం దుర్మార్గం. సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నాం. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వైఎస్సార్‌సీపీకి నైతిక విజయంగా భావించవచ్చు.

-ఆకేపాటి అమరనాథరెడ్డి ఎమ్మెల్యే, రాజంపేట

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారనే ఆరోపణలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయం. ఎలాంటి ఆధారాలు లేకుండా కల్తీ నెయ్యి వాడారంటూ చేసిన దుష్ప్రచారంపై ప్రభుత్వానికి అక్షింతలు వేసింది. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిపై విచారణ చేసేందుకు సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలో సిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం.

-కె.వీరారెడ్డి, గాలివీడు

శుభపరిణామం



తిరుమల లడ్డూ కల్తీ పేరుతో టీడీపీ చేస్తున్న దుష్ప్రచారంపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ బృందం విచారణ చేస్తే ఏకపక్షంగా జరిగే అవకాశం ఉంటుంది. భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం కాబట్టి న్యాయ వ్యవస్థ పరిధిలోని బృందాలైతే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇది శుభపరిణామం. - ఎ.వెంకట్రామిరెడ్డి, తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాయచోటి

తిరుమల లడ్డూపై అసత్య ప్రచారాలు తగవు



ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమలలో భక్తులు ప్రసాదంగా స్వీకరించే లడ్డూపై అసత్య ప్రచారాలు తగవు. గత ప్రభుత్వం లడ్డూలో కల్తీ నెయ్యి వాడిందంటూ సీఎం చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేయడం సబబుకాదు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని ఆ శ్రీనివాసుడిని వేడుకుంటున్నా.

-శివారెడ్డి, మల్లూరు గ్రామం, చిన్నమండెం

బాబు నైజాన్ని ఎత్తి చూపిన సుప్రీం కోర్టు



సీఎం చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల లడ్డూను వివాదం చేయడం క్షమించరాని నేరం. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని చంద్రబాబుకు సుప్రీం కోర్టు మొట్టి కాయలు వేసిందంటే అంతకంటే సిగ్గుచేటు మరొకటి లేదు. ఇప్పటికైనా బాబు తాను చేసిన తప్పునకు ప్రాయశ్చిత్తపడి ఏడుకొండల స్వామి భక్తులకు క్షమాపణ చెప్పాలి.

- పాపినేని విశ్వనాథరెడ్డి, రాజంపేట

భక్తులకు క్షమాపణ చెప్పాలి



కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి లడ్డూను సైతం సీఎం చంద్రబాబు తన రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకున్నారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారంటూ చేసిన వ్యాఖ్యలు.. భక్తుల మనోభావాలను దెబ్బతతీశాయి. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఇప్పటికైనా చంద్రబాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి. భక్తులకు క్షమాపణ చెప్పాలి.

-ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్

తిరుమల పవిత్రతను కాపాడాలి



కుట్ర రాజకీయాలతో లడ్డూ ప్రసాదంపై దుమారం లేపడం బాధాకరం. తిరుమల పవిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. జరిగిన సంఘటనపై, చేసిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు నెగ్గతేల్చాల్సిన అవసరం ఉంది. తరుమలేశుని భక్తుల మనోభావాలు కాపాడాలి.

- టీఎల్. వెంకటేష్, పీలేరు.

సీబీఐ విచారణతో నిజాలు వెలుగులోకి..



సీబీఐ సిట్ బృందం విచారణ పూర్తిగా స్వాగతించదగిన విషయం. తిరుమల లడ్డూ వివాదంలో సీబీఐ విచారణతో నిజాలు వెలుగులోకి వస్తాయి. శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతోనే సుప్రీంకోర్టు ద్వారా సీబీఐ విచారణ ఆదేశాలు వచ్చాయి. లడ్డూపై దురుద్దేశపూర్వకంగా చంద్రబాబు ఆరోపణలు చేశారన్నది ప్రజలందరికి అర్థమవుతోంది.

-గార్ల చంద్రమౌళి, మదనపల్లె

కల్తీ నెయ్యి వాడారనడం బాధ్యతారాహిత్యం



తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడారని చంద్రబాబు చెప్పడం బాధ్యతారాహిత్యం. సీబీఐ డైరక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేయాలని సుప్రీంకోర్టు చెప్పడం స్వాగతించాల్సిన విషయం. వంద రోజుల ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజ దృష్టిని మరల్చడానికి ఇలా చేశారనేది స్పష్టమవుతోంది. త్వరలో వారి పాపాలు పండనున్నాయి.

-రత్తయ్య, రైల్వేకోడూరు

దేవుడు క్షమించడు



కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి విషయంలో తప్పులు చేస్తే ఆ దేవదేవుడు క్షమించడు. ఎటువంటి ఆధారాలు లేకపోయినా సీఎం స్థాయిలోని వ్యక్తి తిరుమల లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసేలా చేసిన ఆరోపణలు సరికాదు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయం.

-సరశా సాయికుమార్‌శర్మ, వేద పండితులు, నారాయణ నెల్లూరు, పెనగలూరు

చంద్రబాబు నీచ రాజకీయాలకు పరాకాష్ట



చంద్రబాబు నీచరాజకీయాలకు ఇదో పరాకాష్ట. అబద్ధాలు చెప్పి రాజకీయాలు చేయడం ఒక తప్పయితే.. వారి స్వార్థ రాజకీయాలకు స్వామివారి ప్రసాదాన్ని వాడుకోవడం చంద్రబాబుకే దక్కింది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై నిందలు వేయడానికి.. తన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని చెప్పడం సిగ్గు చేటు. సుప్రీం కోర్టు చీవాట్లు పెట్టడంతో ఏమి చేయాలో బాబుకు తోచలేదు.

-మలిశెట్టి వెంకటరమణ, చిట్వేలి

దేవ దేవుడితో రాజకీయాలు సరికాదు



దేవ దేవుడు తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సీబీఐ దర్యాప్తు వేయాలనే సుప్రీంకోర్టు తీర్పుతోనైనా దేవుడితో రాజకీయాలు చేయరాదనే తెలివి రావాలి. దర్యాప్తు చేసి నిజానిజాలు నిగ్గు తేల్చాలి.

- మండల నాగేంద్ర, వైఎస్సార్సీపీ రాష్ట్ర సమితి కార్యదర్శి, కోడూరు

న్యూస్‌రీల్

నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల

రాయచోటి: పంట పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ. 2 వేలు శనివారం విడుదల చేయనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహారాష్ట్రలోని వాసిమ్ నుంచి 5వ తేదీ పీఎం కిసాన్ 18వ విడత నిధులను విడుదల చేస్తారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1,73,591 మంది రైతులకు రూ. 34.72 కోట్లు విడుదల చేయనున్నట్లు వ్యవసాయాధికారి చెప్పారు.

8న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

రాయచోటి అర్బన్: జిల్లాస్థాయి యోగాసన పోటీలు అక్టోబరు 8న రాయచోటి పట్టణంలో నిర్వహించనున్నట్లు ఏపీ యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కూనా కృష్ణదేవరాయులు, కడప అధ్యక్షుడు ఆర్.రంగనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మాసాపేటలో ఉన్న సాయిశుభ కల్యాణమండపంలో ఉదయం 9గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. బాలురు, బాలికలు, మహిళలు, పురుషులకు వేర్వేరు విభాగాలుగా పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారిని ఈనెల 26న నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

అంతర్ జిల్లా తైక్వాండో పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరులోని ప్రభుత్వ జూనియర్‌కళాశాలలో శుక్రవారం 68వ అంతర్‌జిల్లా తైక్వాండో పోటీలు ప్రారంభమయ్యాయి. 11 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారద మాట్లాడుతూ రెండురోజులపాటు జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. స్టేట్ రెఫరీ రవిశంకర్‌రాజు పోటీలను పర్యవేక్షించారు.కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌ప్రసాద్‌రెడ్డి, అరుణ కుమారి, సుబ్బరాజు తదితరులుపాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

పెద్దతిప్పసముద్రం: ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరులోగా పక్కా గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ శివయ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు హౌసింగ్ కాలనీలను ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణ పనులు నత్త నడకన ఎందుకు సాగుతున్నాయో ఏఈ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 30 మండలాల్లో 79,721 పక్కా గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 46,551 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.గృహాలు మంజూరై ఇంత వరకు నిర్మాణాలు చేపట్టని వారు 12,586 మంది ఉన్నారన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, పోలీసు, ఇరిగేషన్ అధికారులు, క్షేత్ర స్థాయిలో వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమన్వయంతో ఇసుక లబ్ధిదారులకు అందేలా చూస్తామన్నారు.

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: జిల్లా ఆర్థికాభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు 2వ విడత వందరోజుల ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 2వ విడత వందరోజుల ప్రణాళిక రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కీలక రంగాలు, అంశాలపైన దృష్టిసారించి జిల్లా అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించాలన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలు ఏమిటి, వాటిని ఎలా సాధించగలం, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సీపీఓ వెంకట పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న మహిళా పోలీసు వరలక్ష్మిని పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీధర్

మహిళా పోలీసుకు పరామర్శ

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సచివాలయం మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మిని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 50 వేల నగదును కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు కలెక్టర్ అందజేశారు. సుండుపల్లి మండలం, పోలిమేరపల్లి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్న ఎ వరలక్ష్మీ ఈనెల 1న పింఛన్ పంపిణీకి వెళ్తుండగా ప్రమాదానికి గురైంది. ప్రమాద విషయాన్ని ఎంపీడీఓ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మహిళా పోలీసుకు రాయచోటిలోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం చికిత్సలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం తరపున తనకు ఆర్థికసహాయం అందించేలా కృషి చేసిన కలెక్టర్‌కు మహిళా పోలీస్ వరలక్ష్మీ, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ: జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ యాప్‌లో నమోదైన మహిళలకు రుణాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో క్లస్టర సమీక్షా సమావేశం నిర్వహించారు.శ్రీనిధి, బ్యాంకు లింకేజ్‌రుణాలు, ఉన్నతి రుణాలపై లోకోస్‌యాప్ తదితర అంశాలపై సమీక్షించారు. సంఘ సభ్యు లకు వ్యక్తిగతంగా ఉపాధి పొందేందుకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రెండు శాతం వడ్డీ రాయితీతో రుణాలు కల్పించేందుకు చర్య లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్, బ్యాంకు లింకేజీ డీపీఎం లక్ష్మిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ సత్యానారాయణ

శివానీ.. భవానీ నమోస్తుతే

ప్రొద్దుటూరు కల్చరల్: దేవి శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు భవాని దేవిగా భక్తులను కరుణించారు. నరసింహాస్వామి, వివిధ దేవతా మూర్తుల సెట్టింగ్ ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి ఆలయం, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భవానిదేవి, శివాలయంలో గజలక్ష్మీ దేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. అన్ని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది.



అమ్మవారిశాలలో భవాని దేవి



అమ్మవారిశాలలో భక్తుల సందడి

రేపు 'గడియారం' పురస్కార సభ

ప్రొద్దుటూరు కల్చరల్: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమం వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 43వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు రచన సాహిత్యవేదిక ఉపాధ్యక్షుడు గడియారం వేంకటశేషశర్మ పేర్కొన్నారు. రామేశ్వరంలోని గడియారం వారి లైబ్రరీలో ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, వైద్యుడు డాక్టర్ శింగరాజు రామకృష్ణ ప్రసాదరావుకు అందిస్తున్నామన్నారు. ఆయన రచించిన ''శ్రీ శంభు భారతం'' అనే కావ్యానికి ఈ పురస్కారం అందిస్తున్నామని చెప్పారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు ఆత్మహత్యాయత్నం

కురబలకోట : తరచూ సెల్‌ఫోన్ వాడొద్దని తల్లిదండ్రులు మందలించారని ఓ యువతి గురువారం రాత్రి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలోని అంగళ్లుకు చెందిన సంధ్య (19) ఎక్కువ సేపు సెల్‌ఫోన్‌లో మాట్లాడేది. ఇది గమనించిన తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన యువతి నిద్రమాత్రలు మింగింది. కుటుంబసభ్యులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ చాంద్ బాషా తెలిపారు. శుక్రవారం నీరు గట్టు వారి పల్లె సమీపంలోని కాట్లాటపల్లె రోడ్డులో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాట స్థావరం వద్ద జూదమాడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ. 23 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ అన్సర్ బాష, వన్ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామంలో గురువారం రాత్రి వల్లెపు రామ శేఖర్ (48 కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ హాజీ బాషా కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురిజాల గ్రామానికి చెందిన వల్లెపు రామ శేఖర్ కడుపు నొప్పితో గతకొంతకాలంగా బాధపడుతుండేవాడని.. గురువారం రాత్రి కడుపు నొప్పి తీవ్రకావడంతో తాళలేక తన ఇంటి సమీపాన చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

వాటర్ గ్రిడ్‌తో తాగునీటికి శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకాంత్ రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

బి.కొత్తకోట : వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన వాటర్ గ్రిడ్‌తో రెండు జిల్లాలకు చెందిన ఐదు నియోజకవర్గాలకు శాశ్వత తాగునీటి పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బి. కొత్తకోట మండలంలోని గుంతా వారిపల్లెలో పర్యటించారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి తంబళ్లపల్లిలో జరిపిన పాదయాత్ర సందర్భంగా ప్రజలకు ఫ్లోరైడ్ కష్టాలు తప్పించి సురక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రిగా ఈ హామీ నెరవేర్చారని అన్నారు. రూ.2,300 కోట్లతో తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలతో వాటర్ గ్రిడ్ మంజూరు చేశారు అన్నారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని అందించడం, పైప్ లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం ఉంటాయన్నారు. ఈ వాటర్ గ్రిడ్ కు గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను తరలించి శుద్ధిచేసి అందించడం జరుగుతుందన్నారు. ఈ పనులకు సంబంధించి గత ప్రభుత్వమే టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లతో పనులు అప్పగించడం పూర్తయిందన్నారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్ వాటర్ గ్రిడ్ పనులు చేపట్టడంపై సర్వే కూడా పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించడమే మిగిలి ఉందని గుర్తు చేశారు. వాటర్ గ్రిడ్ పనులు పూర్తయితే 30 ఏళ్ల పాటు ఈ ఐదు నియోజకవర్గాల ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని స్పష్టం చేశారు. వచ్చే 30 ఏళ్లకు పెరిగే జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా అందించేలా ఇందులో ప్రణాళికలు రూపొందించడం జరిగిందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనులు పూర్తి చేసేందుకు చిత్తశుద్ధి చూపాలని కోరారు. ఫ్లోరైడ్ ఇబ్బందుల నుంచి ప్రజలను కాపాడే ఈ పథకంపై నిర్లక్ష్యం చూపవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమాల్లో సర్పంచ్ నాగిరెడ్డి, భీమగాని పద్మనాభ రెడ్డి, కాలువపల్లి మధు, చిదంబరరెడ్డి, గోపాలు, కృష్ణారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



పట్టుబడిన ఎర్రచందనం దుంగలను చూపుతున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని ఎద్దుల గుండాల అటవీ ప్రాంతంలో శుక్రవారం 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ బి. కళావతి తెలిపారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు వారి తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఎద్దుల గుండాల అటవీ ప్రాంతంలో తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశామన్నారు. అక్కడ కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధం చేస్తుండగా వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారన్నారు. అక్కడ లభ్యమైన 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కొత్త వ్యక్తులు గాని, అనుమానాస్పద వాహనాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఎర్రచందనంను అక్రమ రవాణాచేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఎఫ్‌బీఓ పెంచల్‌రెడ్డి, ప్రొటక్షన్ వాచ్చర్‌లు, తదితులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లి మండలం పోతబోలు గ్రామానికి చెందిన మహబూబ్ బాషా (22) పల్లెలు తిరుగుతూ చిరు వ్యాపారాలు చేస్తూ జీవిస్తుంటాడు. ఈ క్రమంలో వ్యాపార అవసరాల నిమిత్తం రూ. రెండు లక్షల వరకు ఇతరుల వద్ద అప్పు చేశాడు. తిరిగి అప్పు చెల్లించలేకపోవడంతో రుణదాతలు నుంచి ఒత్తిడి అధికమైంది. దీంతో మనస్థాపం చెందిన శుక్రవారం ఇంటి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ములకలచెరువు మండలం తమ్మి రెడ్డి గారి పల్లెకు చెందిన వెంకట శివ భార్య డి శిరీష (20) కుటుంబ సమస్యల కారణంగా అత్తతో గొడవపడి మనస్థాపం చెంది ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అయ్యా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ కృష్ణమోహన్

పీలేరు రూరల్ : మండలంలో గత 18న నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాలిలావున్నాయి. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన కృష్ణానాయక్ భార్య మూడే నీలావతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అదే ప్రాంతానికి చెందిన కె. రవి, కె. నాగరత్నమ్మ, కవితలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. శుక్రవారం బండ్లవంకలో డీఎస్పీ విచారణ జరిపారు. కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళా టెకీ ఆత్మహత్య

– మృతురాలు కడప నగరవాసి



గౌతమి(ఫైల్)

బనశంకరి : ఐదో అంతస్తునుంచి దూకి మహిళా టెకీ ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏపీలోని వైఎస్సార్ జిల్లా కడప నగరానికి చెందిన గౌతమి(27) బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ ప్రశాంత్ లేఅవుట్‌లో ఉన్న పీజీలో నివాసం ఉంటూ టీసీఎస్ కంపెనీలో పనిచేస్తోంది. ఏం జరిగిందో ఏమో కాని శుక్రవారం తానుంటున్న పీజీ ఐదో అంతస్తుపైకి వెళ్లి దూకింది. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. పీజీ నిర్వాహకులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. ఆమె ఉంటున్న గదిలో పరిశీలించగా ఒక లేఖ లభించింది. తన మృతిపై ఎలాంటి దర్యాప్తు చేయరాదని, మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా తల్లిదండ్రులకు అప్పగించాలని గౌతమి ఆ లేఖలో రాసినట్లు పోలీసులు తెలిపారు. కాగా వైదేహి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

ద్విచక్రవాహనం-ఆటో ఢీ

– ముగ్గురికి గాయాలు

తంబళ్లపల్లె : ద్విచక్రవాహనం, ఆటో ఢీకొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘనట శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. కోసువారిపల్లెకు చెందిన ఫక్రుద్దీన్ (30)భార్య షబానాలు ఎద్దులవారిపల్లె వద్ద టమటా తోట నాటారు. వారు తోట పనులు ముగించుకుని సొంత ఆటోలో మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. మూలపల్లె సమీపంలోని చింతతోపు మలుపు వద్దకు రాగానే జంజురుపెంట పంచాయతీ రామాపురంకు చెందిన వినోద్ (24) ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతున్నాడు. మలుపువద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొన్నాయి. వినోద్, ఫక్రుద్దీన్‌కు బలయమైన గాయాలయ్యాయి. షబానాకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య తన సొంతవాహనంలో బాధితులను ఆస్పత్రికి తరలించారు. వినోద్‌ను తలకు బలమైన గాయం కావడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

– నాలుగు కిలోల కణితిని వెలికితీసిన వైద్యులు

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి పేద మహిళకు వైద్యులు ప్రాణం పోశారు. కడుపునొప్పి తాళలేక ఆసుపత్రికి వచ్చిన శంకరమ్మ(45)కు ఆసుపత్రి వైద్యులు శుక్రవారం శస్త్ర చికిత్స చేశారు. గురువారం ఆసుపత్రికి వచ్చిన శంకరమ్మను వైద్యులు పరీక్షించి రక్తహీనత, కడుపునొప్పితో బాధపడుతున్నట్లు గుర్తించారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమతలేదని వైద్యులను కోరడంతో వైద్యులు మహేశ్వరరాజు, వెంకట శివ, అనీల్‌లు కలిసి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. కడుపులో ఉన్న నాలుగు కిలోల గడ్డను తొలగించారు. శస్త్ర చికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా ఉండటంతో బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పురుగు మందు సేవించి వృద్ధుడు మృతి

కమలాపురం : మండల పరిధిలోని జంగంపల్లె ఎస్సీ కాలనీకి చెందిన రామ సుబ్బయ్య (73) పురుగు మందు సేవించి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామ సుబ్బయ్యకు మద్యం అలవాటు ఉంది. అయితే గత కొంత కాలంగా అనారోగ్యాని గురయ్యాడు. బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అవయవాలన్నీ దెబ్బతిన్నాయని, ఇంటికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రామసుబ్బయ్య ఇంటి వద్దనే ఉన్నాడు. జీవితంపై విరక్తి కలిగిన అతను గురువారం రాత్రి పొద్దుపోయాక మద్యంలో పురుగు మందు కలుపుకుని సేవించాడు. వాంతులు చేసుకుంటూ కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మృతిచెందాడు. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమ్మవారి వెండి కిరీటం చోరీ

జమ్మలమడుగు : పట్టణంలోని కన్నెలూరు వెలుపల ఉన్న గంగమ్మ అమ్మవారు వెండి కిరీటాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆలయ పరిసరాలలో ఎవరు లేకపోవడం చేసి ఆలయంలోకి వెళ్లి అమ్మవారి కిరీటాన్ని ఎత్తుకెళ్లారు.

అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నేతలపై కేసులు ఎత్తివేయాలి

- సమ్మెకాలపు హామీలను వెంటనే అమలు చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ



మాట్లాడుతున్న అంగన్‌వాడీ, ఏఐటీయూసీ నేతలు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగిన ఆందోళనలో అంగన్‌వాడీలు, ఏఐటీయూసీ నేతలపై పెట్టిన కేసులను ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లు, ఏఐటీయూసీ నేతలు తమపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె సందర్భంగా తమకు అండగా నిలబడిన కూటమినేతలు నేడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కనీస వేతనంగా రూ.26 వేలు, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు అప్‌గ్రేడ్‌చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కన్వీనర్ నాగేశ్వరి, కో-కన్వీనర్ సరోజమ్మ, సుజాత, అనూరాధ, నేత మురళి, లంబాడీ హక్కుల పోరాట సమితి నేత శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న పీసీపీ ఎన్‌డీటీ దేవ శిరోమణి

మదనపల్లె : ప్రైవేటు ఆసుపత్రిలో గాని, స్కానింగ్ సెంటర్ లో గాని లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పీసీపీ ఎన్‌డీటీ అధికారి దేవ శిరోమణి అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలతో శుక్రవారం పట్టణంలోని ఐఎంఏ హాల్ (గుప్తా హాస్పిటల్)లో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీతో ప్రభుత్వ, ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు ఒక్క రోజు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి స్కాన్ సెంటర్ నిబంధనలు మేరకు జిల్లా అథారిటీ వద్ద తప్పకుండ రిజిస్ట్రేషన్ చేయించుకోవాన్నారు. ప్రతి స్కాన్ సెంటర్‌లో ఐఈసీ ఫ్లెక్సీలు ప్రదర్శించాలి. నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువైతే జరిమానా, జైలు శిక్ష, తో పాటు రిజిస్ట్రేషన్ రద్దు అవుతుందన్నారు. కార్యక్రమం లో హెల్త్ ఎడ్యుకేటర్స్ ఉషారాణి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అస్ఫియా మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి



సబ్ కలెక్టర్ మేఘాస్వరూప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తదితరులు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణానికి చెందిన చిన్నారి బాలిక అస్ఫియా అంజుమ్‌ను (07) కిడ్నాప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ముస్లింలు,మత పెద్దలతో కలసి స్థానిక బెంగళూరు బస్టాండ్ నుంచి టౌన్ బ్యాంక్ సర్కిల్ కుండా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. చిన్నారిని కిరాతకంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయం పై స్పందించిన సబ్ కలెక్టర్ చిన్నారి హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మత పెద్దలు ముస్లిం యువత పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



కలకడలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ముస్లింలు

కలకడ : చిన్నారి ఆస్ఫియ హత్యకేసులో నిందితులను గుర్తించి ఉరితీయాలని కలకడ ముస్లీం, మైనార్టీ యూత్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి అన్ని మసీదులలో నమాజ్ అయిన అనంతరం కొవ్వొత్తులు చేతపట్టి ఆస్ఫియ మృతికి కారకులను గుర్తించి ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఆస్ఫియ మృతికి సంతాపం తెలియజేసి నివాళి అర్పించారు. కొవ్వొత్తుల ర్యాలీ అనంతరం మూడు రోడ్లు కూడలినందు మానవహారం ఏర్పాటు చేసి ఆస్ఫియ ఆత్మకు శాంతి కలగాలని కొవొవ్వత్తులతో ప్రత్యేక ప్రార్ధన చేశారు.

అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్ ప్రారంభం

తొలి మ్యాచ్‌లో ఆధిక్యంలో చిత్తూరు జట్టు



షరీక్ అక్తర్, చిత్తూరు (53 పరుగులు)



రక్షణ్‌సాయి, చిత్తూరు (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరం వేదికగా ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కడప వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 58.5 ఓవర్లలో 85 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బి. మోక్షజ్ఞరెడ్డి 29 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ రక్షణ్‌సాయి 5 వికెట్లు, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 38 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేశారు. జట్టులోని షరీఫ్ అక్తర్ 53 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు వివేక్ 3, అంకిత్ పరీక్ 2 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 2 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో ప్రకాశం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 77 ఓవర్లలో 114 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని రాజ్‌మోహన్ 28 పరుగులు చేశాడు. విశాఖ బౌలర్లు వినోద్ 2, లోహిత్‌రాఘవేంద్ర 2 , ప్రఖ్యాత్‌వర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 62 పరుగులు చేసింది. జట్టులోని అక్షిత్‌రెడ్డి 18 పరుగులు చేశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి విశాఖ జట్టు 52 పరుగుల తేడాతో వెనుకంజలో ఉంది.

కొడుకు కోసం..తల్లి ఆరాటం

- కువైట్ నుంచి వచ్చిన రెండు రోజులకే అదృశ్యం
- భార్య, పెద్ద అత్త, మామలపై అనుమానం
- చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- 45 రోజులుగా గాలింపు
- తల్లి రాములమ్మ ఆవేదన



వివరాలు తెలుపుతున్న తల్లి రాములమ్మ

రాజంపేట రూరల్ : ఒక్కగానొక్క కొడుకు కనిపించక పోవటంతో నవ మాసాలు మోసిన కన్న తల్లి కన్నీరు మున్నీరవుతోంది. కొడుకు ఎటు వెళ్లాడో, అసలు ప్రాణాలతో ఉన్నాడో లేదో కూడా తెలియక ఆ తల్లి తల్లడిల్లిపోతుంది. 45 రోజుల నుంచి తన కొడుకు ఆచూకి కోసం ఎక్కడ పడితే అక్కడ.. ఏ ఊరు పడితే ఆ ఊరులో కొడుకు ఆచూకీ కోసం గాలిస్తూ ఆతల్లి పడే ఆరాటం చూసి బంధువులను సైతం కంటనీరు పెట్టుకుంటున్నారు. తన కొడుకు తనకు దక్కాలని కనిపించిన ప్రతి ఆలయంలో పూజలు చేస్తూ దేవుళ్లకు మొక్కు కుంటోన్న ఆతల్లి మనసును చూసి ఆమే బంధువులు ఆవేదన చెందుతున్నారు.

కువైట్ నుంచి వచ్చిన రెండు రోజులకే..

తన బిడ్డ కువైట్ నుంచి వచ్చిన రెండు రోజులకే అదృశ్యం అయినాడని తల్లి ఏరుకాల్వ రాములమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం తన కూతురు రాజేశ్వరితో కలిసి రాములమ్మ విలేకర్ల ఎదుట తన ఆవేదనను వినిపించింది. పుల్లంపేట మండలంలోని వత్తలూరు వడ్డిపల్లికి చెందిన ఏరుకాల్వ సిద్దయ్య తన భర్త అని తెలిపింది. తమకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు అని తెలిపింది. కుమారుడు వెంకటేశ్వర్లు అందరికంటే పెద్దవాడని తెలిపింది. అతనికి ఐదు సంవత్సరాల క్రితం చిట్వేలి మండలం గాంధీ నగర్ వడ్డిపల్లికి చెందిన కుర్రపోతుల వెంకటేష్ రెండవ భార్య రుక్మిణమ్మల పెద్దకుమార్తె రేవతితో వివాహం జరిగిందన్నారు. వివాహానికి ముందు రేవతి కువైట్‌కు పోయి వచ్చిందని తెలిపింది. వివాహం అయినప్పటి నుంచి తన కొడుకు కోడలి మధ్య తరచూ గొడవలు జరిగేవని తెలియజేశారు. వివాహమైన రెండు నెలలకు తన కుమారుడు వెంకటేశ్వర్లు జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లినట్లు తెలిపింది. తరుచూ గొడవలు పడే వారికి ఒక



వెంకటేశ్వర్లు (ఫైల్)

కుమార్తె గౌతమి (4), కుమారుడు యశ్వంత్(2) ఉన్నట్లు తెలియజేశారు. 2 నెలల క్రితం కువైట్ నుంచి వచ్చిన తన కొడుకు వెంకటేశ్వర్లు తిరిగి కువైట్‌కు వెళ్లేందుకు టికెట్‌ను తన కోడలు ఆమె తమ్ముడు వంశీ వద్ద చేయించినట్లు తెలిపింది. అయితే తన కుమారుడు కువైట్‌కు వేళ్లే సమయంలో అతని వద్ద ఉన్న బత్తాక్ కార్డును కోడలు బలవంతంగా లాక్కొని తన అన్నతో కలిసి బెదిరించి పంపినట్లు తెలిపింది. అయితే తన కొడుకు కువైట్‌కు వెళ్లిన 20 రోజులకే బెదిరించి ఇండియాకు పిలిపించినట్లు తెలిపింది. తన దగ్గర ఉన్న తన కొడుకు కోసం కోడలు రేవతి తన పెద్దమ్మ ఇమదిరమ్మను, తండ్రి వెంకటేష్‌ను తీసుకొచ్చి గౌతమి కాలు విరిగింది రమ్మని ఆగస్టు 25వ తేదీ పిలుచుకు వెళ్లారని తెలిపింది. ఆ రోజే వారి మధ్య పెద్ద గొడవ జరిగినట్లు, అదే సమయంలో కోడలు రేవతి ఆమే తండ్రి వెంకటేష్ తన కుమారుడిపై దాడి చేసినట్లు తన కొడుకు ఫోన్ చేసి తెలిపాడన్నారు. మరుసటి రోజు 26వ తేదీ నుంచి తన కుమారుడు కనిపించలేదని తెలియజేశారు. మా కోడలిపై అనుమానం వచ్చి చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన కుమారుని ఆచూకి తెలిసిన వారు 6304065931, 9505964196 అనే నెంబర్లకు ఫోన్ చేసి పుత్ర భిక్ష పెట్టాలని కోరారు.